# 109. అల్ కాఫిరూన్ (అవిశ్వాసులు) సూరా

## పరిచయం

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో మొత్తం 6 ఆయతులు ఉన్నాయి. అవిశ్వాసాన్ని, అవిశ్వాసులను తిరస్కరించడం ఈ సూరా ప్రధాన ఉద్దేశ్యం. మొదటి ఆయతులో అవిశ్వాసుల (కాఫిరూన్) గురించిన ప్రస్తావనను ఈ సూరాకు పేరుగా పెట్టడం జరిగింది. ఏకదైవారాధన పట్ల ఎన్నడూ రాజీపడరాదు. అల్లాహ్‌ను తప్ప మరెవ్వరినయినా గాని, లేదా మరి దేన్నయినా గాని ఆరాధించడాన్ని ఈ సూరా తిరస్కరించింది.

## 109. అల్ కాఫిరూన్[1] సూరా

## سُورَةُ الكَافِرُونَ

అవతరణ :మక్కా ఆయతులు :6

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

1 (ఓ ప్రవక్తా! వారికి) చెప్పు : "ఓ తిరస్కారులారా![2]

قُلْ يٰۤاَيُّهَا الْكٰفِرُوْنَ ۝١

2 "మీరు ఆరాధించే వాటిని నేను ఆరాధించటం లేదు.

لَاۤ اَعْبُدُ مَا تَعْبُدُوْنَ ۝٢

3 "నేను ఆరాధిస్తున్న వానిని మీరు ఆరాధించరు.

وَلَاۤ اَنْتُمْ عٰبِدُوْنَ مَاۤ اَعْبُدُ ۝٣

4 "మీరు ఆరాధించే వాటిని నేను ఆరాధించబోను.

وَلَاۤ اَنَا عَابِدٌ مَّا عَبَدْتُّمْ ۝٤

5 "మరి నేను ఆరాధించేవానిని మీరెలాగూ ఆరాధించరు.[3]

وَلَاۤ اَنْتُمْ عٰبِدُوْنَ مَاۤ اَعْبُدُ ۝٥

1. దైవప్రవక్త (సఅసం) కాబా గృహ ప్రదక్షిణ సందర్భంగా రెండు రకాతుల నమాజు చేసినప్పుడు గానీ, మగ్రిబ్, ఫజ్ర్‌లలోని సున్నత్ నమాజులలోగాని ఈ సూరాతోపాటు, ఇఖ్లాస్ సూరా పఠించేవారని ప్రామాణిక హదీసుల ద్వారా రూఢీ అవుతోంది. రాత్రిపూట ఈ సూరా (ఖుల్ యా అయ్యుహల్ కాఫిరూన్) పఠించి నిద్రపోతే షిర్క్‌తో తెగత్రెంపులు చేసుకున్నవారుగా ఖరారవుతారని ఆయన (స) ప్రియసహచరులు కొందరికి చెబుతూ ఉండేవారు (ముస్నదె అహ్మద్ - 5/456; తిర్మిజీ - 3403; అబూ దావూద్ - 5055; మజ్‌మవుజ్జవాయెద్ - 10/121). ఆయన (సఅసం) స్వయంగా కూడా ఈ విధంగా ఆచరించేవారని మరికొన్ని ఉల్లేఖనాల ద్వారా తెలుస్తోంది (ఇబ్నె కసీర్).

2. ఈ సూరాలోని 'కాఫిరూన్' (సత్యతిరస్కారులు, విశ్వసించటానికి నిరాకరించినవారు) అనే పదం ప్రత్యేకంగా కొంతమందికి మాత్రమే వర్తిస్తుంది. వారెవరో అల్లాహ్‌కే తెలుసు. ఎందుకంటే ఈ సూరా అవతరించిన తరువాత మక్కాకు చెందిన అనేకమంది అవిశ్వాసులు విశ్వసించి, అల్లాహ్‌ను ఆరాధించారు. (ఫత్‌హుల్ ఖదీర్).

3. చెప్పిన విషయమే ఇంకొకసారి చెప్పబడింది. కొంతమంది అనువాదకులు మొదటి వాక్యాలను (2, 3) వర్తమాన కాలంగా, తరువాతి వాక్యాలకు (4,5) భవిష్యత్కాలంగా

| | |
|---|---|
| **6** “మీ ధర్మం మీది, నా ధర్మం నాది.”[4] | لَكُمْ دِيْنُكُمْ وَلِيَ دِيْنِ ۝٦ |

తీసుకున్నారు. దీని గురించి మరీ అంతగా సతమతం కావలసిన అవసరం ఏమీ లేదంటారు ఇమామ్ షౌకానీ. ఎందుకంటే విషయాన్ని నొక్కి వక్కాణించటానికి మాటను పునరావృతం చేయటం అరబీ భాష విశిష్టత. దివ్య ఖుర్ఆన్‌లో కూడా అనేకచోట్ల ఈ శైలి అవలంబించ బడింది. ఉదాహరణకు : అర్రహ్మాన్ సూరా, ముర్సలాత్ సూరాలలో ఒకే ఆయతు అనేకసార్లు పునరావృతం అవుతుంటుంది. అల్ కాఫిరూన్ సూరాలో ఒకటికి రెండుసార్లు చెప్పిన మాటే చెప్పటంలోని ఉద్దేశం ఏమిటంటే, “ఓ అవిశ్వాసులారా! మీరంతా కోరుతున్నట్లు నేను ఏకేశ్వరోపాసనా మార్గాన్ని వీడి బహుదైవోపాసనా మార్గాన్ని అవలంబించటమన్నది ఎన్నటికీ జరగని పని. ఒకవేళ దేవుడు మీ నొసట సన్మార్గ భాగ్యం రాసి ఉండకపోతే మీరు ఏకదైవారాధనకు నోచుకోలేరు.” ఒక సంవత్సరకాలం పాటు నీవు మా దేవతలను పూజిస్తే, ఒక సంవత్సరకాలం పాటు మేము నీ ఆరాధ్య దైవాన్ని పూజిస్తామని అవిశ్వాసులు మహాప్రవక్త (స) ముందు ప్రతిపాదించినప్పుడు ఈ సూరా అవతరించింది.

4. అంటే–(ఓ అవిశ్వాసులారా!) మీరు మీ దేవీదేవతలను వదలుకోవటానికి సిద్ధంగా లేనపుడు నేను నా నిజదైవాన్ని ఎందుకు వదలుకోవాలి. నేను నా ధర్మంపై సంతోషంగా ఉన్నాను. “మా కర్మలు మావి. మీ కర్మలు మీవి.” (అల్ ఖసస్ – 55).